

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 265 | పేజీలు : 8 | వెల : రూ.2/- | సోమవారం 19 అక్టోబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

ముగిసిన నామినేషన్లు

ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.

చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు

దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం

అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్

అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 18:

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి.

ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు



పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది. మిగతాది 2లో...

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్



నవంబర్ 3న పోలింగ్.. 5న ఓట్ల లెక్కింపు

నేటి నుంచి ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం..

23 వరకు నామినేషన్ల దాఖలు

అమరావతి: మన జనప్రగతి అక్టోబర్ 18:

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధుల ఎంపికకు సంబంధించి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు వెల్లడించాయి. అక్టోబర్ 19న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం.

మిగతాది 2లో...

సీఈసీ ఎంపిక కు మద్దతిచ్చి తప్పు చేశాం

గవర్నర్‌ను కలిసిన జగన్

ఈసీలో సంస్కరణలు అనివార్యం

కమిషనర్ల నియామకపు ప్రక్రియ మారాలి

స్వయం ప్రతిపత్తి ఉంటేనే ప్రజాస్వామ్య మనుగడ: జగన్

టీడీపీ అరాచకాల్ని ఆపండి గవర్నర్, ఎస్ఈసీలకువైసీపీ అధినేత ఫిర్యాదు



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 18:

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు మిగతాది 2లో...



ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు..

143 ఏళ్ల నాటి లిమోజెస్ టౌన్ హాల్ భవనాన్ని దగ్ధం చేసిన ఆందోళనకారులు

దేశవ్యాప్తంగా 1200 మంది అరెస్ట్, 150 మంది పోలీసులకు గాయాలు

వలస విధానాలే హింసకు కారణమంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్య

హింసకు తావులేదంటూ ఖండించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్

తప్పు నాదే

భారత్ ఆగ్రహం.. దిగొచ్చిన వైస్ ప్రెసిడెంట్..

తప్పు తనదేనన్న జేడీ వాన్స్!

హెచ్-1బీ వీసాదారులపై చేసిన 'బానిసలు' వ్యాఖ్యలపై వాన్స్ వివరణ



న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 18:

హెచ్-1బీ వీసాదారులను 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' (ఒప్పంద బానిసలు) అని సంబోధిస్తూ తాను చేసిన వ్యాఖ్యలపై అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ వెనక్కి తగ్గారు. తన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆ పదప్రయోగం సరికాదని అంగీకరించారు. తన విమర్శ ఉద్యోగులను ఉద్దేశించి కాదని, అమెరికా కంపెనీలు అనుసరిస్తున్న వీసా విధానాలను మిగతాది 2లో...

కోల్‌కతా తొక్కిసలాట ఘటన..

బాధితులను పరామర్శించిన అమిత్ షా..

కోల్‌కతా దుర్గా పూజ మండపంలో తొక్కిసలాటలో 19 మంది మృతి, 25 మందికి గాయాలు

క్షతగాత్రులను పరామర్శించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం సువేందు అధికారి

నిర్వాహకులు సహా ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు ఆదేశం

కోల్‌కతా,మన జనప్రగతి అక్టోబర్ 18:

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గా పూజ ఉత్సవాల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగాన్ సార్వజనిన్ దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోల్‌కతాలో పర్యటించి, బాధితులను పరామర్శించారు. మిగతాది 2లో...



వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

స్థానిక ఎన్నికల నామినేషన్ల గడువు విషయంలో వైసీపీకి చుక్కెదురు

గడువు ముగియడంతో పిటిషన్ నిరర్థకమని తేల్చిచెప్పిన న్యాయస్థానం

అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 18:

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై నెలకొన్న రాజకీయ వేడి నేపథ్యంలో, వైసీపీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నామినేషన్ల దాఖలుకు గడువును పొడిగించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను ఉన్నత మిగతాది 2లో...



నింగినంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు

ట్యాంక్‌బండ్‌పై 700 మంది కళాకారుల ప్రదర్శనల నడుమ హోరెత్తిన ఉత్సవం

బతుకమ్మ ఆడిన గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతక్క, సినీనటులు రష్మిక, విజయ్

బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని పెళ్లప్పుడే ర ష్మికకు చెప్పా.. తీసుకొచ్చా: విజయ్

కులమతాలకు అతీతంగా ప్రజలను ఒకచోటకు చేర్చే పండుగ: మంత్రి జూపల్లి

హైదరాబాద్, మన జనప్రగతి అక్టోబర్ 18:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబు రాలుఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటాయి. పూలనుపూజిస్తూ.. ఆటపాటలతో ఆడపడుచులు సందడి చేస్తూనిర్వహించిన వేడుకలతో తెలంగాణ పల్లె సంస్కృతి నగరవీధుల్లో పురి విప్పింది. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ట్యాంక్‌బండ్‌పై భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోనిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగానిలిచాయి. మిగతాది 2లో...

బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై కాల్పులు..

ముంబైలో తీవ్ర కలకలం

దాడి నుంచి సురక్షితంగా బయటపడ్డ టైగర్, ఆయన డ్రైవర్‌కు గాయాలు

దాడికి బాధ్యత వహిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్

నిందితుల కోసం 12 బృందాలతో గాలింపు చేపట్టిన ముంబై పోలీసులు




పండగ పూట ఛార్జీల బాదుడు..

పండగ స్పెషల్ బస్సుల ఛార్జీల పెంపుపై హరీశ్ రావు విమర్శలు

సాధారణ బస్సులనే స్పెషల్స్‌గా నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు

స్పెషల్ బస్సులపై 50 శాతం సర్‌ఛార్జి మాత్రమేనంటున్న టీజీఎస్ఆర్టీసీ



హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 18:

బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. మిగతాది 2లో...

వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం తిరస్కరించింది.వివరాల్లోకి వెళితే, నామినేషన్ల స్వీకరణకు నిర్దేశించిన గడువు ఇప్పటికే ముగిసిపోయిందని, అందువల్ల ఈ పిటిషన్ విచారణకు అర్హత కోల్పోయిందని (నిరర్థకం) హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత తాము సాధారణంగా జోక్యం చేసుకోబోమని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో నామినేషన్ల గడువు పొడిగింపు కోసం వైసీపీ చేసిన ప్రయత్నం విఫలమైంది.మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో పాటు సుమారు 70 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా, సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పుంగనూరు పట్టణంలోకి ప్రవేశించకుండా పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. ఈ పరిణామాలపై స్పందించిన ఎంపీ మిథున్ రెడ్డి, అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదని, అభ్యర్థుల హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

తప్పు నాదే :జేడీ వాన్స్

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంగా చేసుకుని మాత్రమే అని స్పష్టం చేశారు. భారత్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు.సీబీఎస్ నిర్వహించిన ఒక టౌన్‌హాల్ కార్యక్రమంలో జేడీ వాన్స్ మాట్లాడుతూ.. "నా మాటలు సరైనవి కావు, ఆ తప్పు నాదే" అని అంగీకరించారు. అమెరికన్లతో భర్తీ చేయలేని ఉద్యోగాలని చెప్పి, విదేశీ నిపుణులను నియమించుకుంటున్న కంపెనీల గురించే తాను మాట్లాడానని వివరించారు. వీసాపై ఆధారపడి పనిచేయడం వల్ల ఉద్యోగులు యాజమాన్యాల చేతిలో శక్తిహీనులుగా మారుతున్నారని, ఉద్యోగం పోతే తమ దేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తుందన్న భయంతో వారు ఫిర్యాదు చేయడానికి కూడా సాహసించడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ బలహీనతను కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయని వాన్స్ ఆరోపించారు.ఈ నెల ప్రారంభంలో వాన్స్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' అనే పదం అత్యంత అవమానకరమని, దీని వెనుక బాధాకరమైన చారిత్రక, వలసవాద నేపథ్యం ఉందని భారత్ స్పష్టం చేసింది. భారతీయ నిపుణులు అత్యంత విద్యావంతులని, నైపుణ్యం కలవారని, వారు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ఆవిష్కరణలకు ఎనలేని సేవలందిస్తున్నారని విదేశాంగ శాఖ గుర్తుచేసింది. తరతరాలుగా వలస వచ్చిన వారి వల్లే అమెరికా చరిత్ర రూపుదిద్దుకుందన్న విషయాన్ని కూడా నొక్కి చెప్పింది.కొన్ని ఐటీ సంస్థలను గ్రీన్ కార్డ్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా జేడీ వాన్స్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ నిపుణులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.
ఈ వ్యాఖ్యలు భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత నిపుణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. తాజాగా వాన్స్ వివరణతో ఈ వివాదం కొంత సద్దుమణిగినట్లు కనిపిస్తోంది.

నింగినంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు

(మొదటి పేజీ తరువాయి)

అమరవీరుల స్మారకం నుంచి మంత్రి సీతక్కఆధ్వర్యంలో నిర్వహించిన మహా బతుకమ్మ ర్యాలీలో 700 మంది కళాకారులు, 700 మందికిపైగా మహిళలు పాల్గొనిపండుగకు మరింత వైభవాన్ని తీసుకొచ్చారు. ట్యాంక్‌బండ్పై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మఆటపాటలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.తెలంగాణ ప్రభుత్వంతెలంగాణ ఆడబిడ్డల సాంస్కృతిక వైభవం, సంప్రదాయాల పరిమళాన్ని చాటి చెప్పిన సద్దుల బతుకమ్మ వేడుకలుట్యాంక్‌బండ్పై పండుగ వాతావరణాన్ని నింపాయి. మహిళల కోలాటాలు, జానపద కళాకారుల ప్రదర్శనలు,బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ ఆడుతూవేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో రాష్ట్రగవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రులు సీతక్క,జూపల్లి కృష్ణారావు, సినీనటులు విజయ్ దేవరకొండ, రష్మికమందన్న పాల్గొని మాట్లాడారు. సినీనటులు విజయ్
దేవరకొండ, రష్మిక మందన్న జంట ప్రత్యేక ఆకర్షణగానిలిచింది. ఈ సందర్భంగా గవర్నర్ శుక్లా మాట్లాడుతూ,ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ స్ఫూర్తితోజలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలనిపిలుపునిచ్చారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో వంటివాతావరణ పరిణామాల నేపథ్యంలో నీటి విలువనుగుర్తించి, ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాలని సూచించారు. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత స్పందించడంకంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమ ని స్పష్టం చేశారు. బతుకమ్మ తెలంగాణ వారసత్వానికి,మహిళా శక్తికి, ప్రకృతి పట్ల ప్రజలకున్న ఆరాధనా భావానికిప్రతీకగా నిలుస్తుందన్నారు. తరతరాలుగా ఈ విశిష్ట సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్న మహిళల సృజనాత్మకత, అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈఏడాది రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవడంభవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడికి హెచ్చరికగాభావించాలని గవర్నర్ సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, చెరువులను పరిరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం వంటిచర్యలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. వ్యవసాయ రంగంలో"నూ అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా స్థానికవాతావరణ పరిస్థితులకు అనుకూలమై న, తక్కువ నీటితోసాగయ్యే పంటలను వేయాలని రైతులకు సూచించారు.

పండగ పూట ఛార్జీల బాదుడు..

(మొదటి పేజీ తరువాయి)ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ. 220 ఉన్న టికెట్‌ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. ఇదేనా మీ ప్రజా పాలన? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్ఛార్జి విధిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్ఛార్జిని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్పటికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీయంగా చర్చ మొదలైంది.

కోల్‌కతా తొక్కిసలాట ఘటన..

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషాద ఘటన కారణంగా రాష్ట్రంలో తన ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలను అమిత్ షా వాయిదా వేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వెంటరాగా, ఆయన నగరంలోని ఒక ప్రైవేట్ నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్. రవి, రాష్ట్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ శరద్‌పవ్ ముఖర్జీ కూడా గాయపడిన వారిని పరామర్శించారు.ఈ ఘటనపై కోల్‌కతా పోలీసులు వేగంగా స్పందించారు. తొలుత 14 మందిని అదుపులోకి తీసుకోగా, విచారణ అనంతరం పూజా కమిటీ నిర్వాహకులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు కూడా ఉన్నారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి, హత్యకు సమానం కాని నరహత్య కింద అభియోగాలు నమోదు చేశారు.శనివారం సాయంత్రం ఆకస్మిక వర్షం కురవడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. అదే సమయంలో మండపంలో తప్పుడు ప్రకటనలు చేయడంతో గందరగోళం చెలరేగి తొక్కిసలాటకు దారితీసిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా సిబ్బంది కొరత, గుంపును అదుపు చేయడంలో వైఫల్యం వంటివి కూడా ఈ దుర్ఘటనకు ప్రధాన కారణాలుగా గుర్తించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు కలకత్తా హైకో ర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిం చింది.

బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై కాల్పులు..

న్యూఢిల్లీ.మన జనప్రగతి అక్టోబర్ 18:బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటన ముంబైలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆదివారం సాయంత్రం జుహు ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, అయితే ఆయన డ్రైవర్ గాయపడ్డారని ముంబై పోలీసులు ధ్రువీకరించారు.వివరాల్లోకి వెళితే, ఆదివారం సాయంత్రం ఫుట్‌బాల్ ఆడి తన బీఎండబ్ల్యూ కారులో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. జుహు పోలీస్ స్టేషన్ పరిధిలోని పుష్పా పార్క్ సమీపంలోకి రాగానే, మోటార్‌సైకిల్‌పై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారును లక్ష్యంగా చేసుకుని మూడు నుంచి ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉండగా, ఆయన కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నానావతి ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో సమీపంలో ఉన్న ఒక ఆటో డ్రైవర్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం.ఘటన గురించి తెలియగానే ముంబై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. డీసీపీ మోహిత్ గార్గ్ సహా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకోవడానికి దాదాపు 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.ఇదిలా ఉండగా, ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు విదేశాల్లో ఉంటున్న గ్యాంగ్‌స్టర్లు అనిల్ పండిట్, హర్మన్ సంధులు సోషల్ మీడియాలో ప్రకటించారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తరఫున ఈ పోస్ట్ పెట్టినట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్‌తో పనిచేసే వారిని లక్ష్యంగా చేసుకుంటామని గతంలోనే హెచ్చరించామని, అందులో భాగంగానే ఈ దాడి జరిగిందని వారు పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఈ సోషల్ మీడియా పోస్టును ముంబై పోలీసులు ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు.

ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు..

న్యూఢిల్లీ.మన జనప్రగతి అక్టోబర్ 18:
ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ ఆందోళనల్లో భాగంగా 143 ఏళ్ల నాటి చారిత్రక లిమోజెస్ టౌన్ హాల్ భవనానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో భవనం చాలా వరకు ధ్వంసమైంది.
ఈ భవనానికి 1873లో నిర్మాణం ప్రారంభం కాగా, 1883లో అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ భవనం ఫ్రాన్స్‌లో చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందింది. ముసుగులు ధరించిన కొందరు ఆందోళనకారులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. మంటల కారణంగా భవనం పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట రెండొంతులు నాశనమైందని వెల్లడించారు.
ఇది దేశ వారసత్వ సంపదకు జరిగిన ఘోర విపత్తు అని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు.దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది మొదట శాంతియుతంగా ప్రదర్శనలు చేపట్టారు. అయితే, పారిస్‌తో పాటు మార్సెల్, లియోన్, లిల్లే వంటి నగరాల్లోనూ ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు లూటీలకు, దహనకాండలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మందిని అదుపులోకి తీసుకున్నామని, 150 మందికి పైగా పోలీసులు గాయపడ్డారని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. ఈ హింసను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తీవ్రంగా ఖండించారు. "మన గణతంత్రంలో హింసకు తావులేదు" అని ఆయన స్పష్టం చేశారు.
ఈ ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నెలకొన్న అశాంతికి వలస విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. "వైవిధ్యం, కరుణ పేరుతో పాశ్చాత్య ఉదారవాదులు మూడో ప్రపంచ దేశాలను ఫ్రాన్స్ వంటి దేశాల్లోకి దిగుమతి చేసుకున్నారు. కానీ, వారిని కలుపుకుపోవడం వంటి ప్రాథమిక ప్రశ్నలను విస్మరించారు" అని వ్యాఖ్యానించారు.
మరిన్ని చారిత్రక కట్టడాలు కాలిపోకముందే ఫ్రాన్స్ ఈ ఆందోళనలను ఆపాలని, అమెరికాలో కాంగ్రెస్ డెమోక్రాట్లు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనని ఆయన హెచ్చరించారు.

ముగిసిన నామినేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

విజయవాడ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వంగవీటి రాధా

జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ (వంగవీటి రాధా) విజయవాడ మేయర్ బరిలో నిలిచారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా ఆయన ఇవాళ తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి తన కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా వంగవీటి రాధా మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీల పూర్తి ఆమోదంతోనే తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. కూటమి మద్దతుతో తన విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నగర ఎమ్మెల్యేల సహకారంతో విజయవాడను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.దివంగత కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా కుమారుడైన రాధా, గతంలో కాంగ్రెస్, ప్రజారాజ్యం, వైఆర్‌సీపీ, టీడీపీ వంటి పార్టీలలో పనిచేసి ఇటీవలే జనసేన పార్టీలో చేరారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయవాడ మేయర్ పోరు ఆసక్తికరంగా మారింది.

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మరింత పెరగనుంది.

23 వరకు నామినేషన్ల దాఖలు

ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అక్టోబర్ 25న అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. అక్టోబర్ 26న అప్పీళ్ల పరిష్కారం అనంతరం, అక్టోబర్ 27న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియనుంది. అదే రోజు పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా వెల్లడించే అవకాశం ఉంది.

నవంబర్ 3న పోలింగ్

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నవంబర్ 3న పోలింగ్ నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. అవసరమైన చోట రీపోలింగ్ నిర్వహించేందుకు నవంబర్ 4వ తేదీని కేటాయించినట్లు సమాచారం. నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

గ్రామీణ రాజకీయాల్లో పెరగనున్న వేడి

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీల బలాబలాలను అంచనా వేసేందుకు కీలకంగా మారనున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారే అవకాశం ఉంది. అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల ప్రభావం, సామాజిక సమీకరణాలు, గ్రామీణ సమస్యలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి.

అభ్యర్థులకు కీలకమైన రోజులు

నామినేషన్ల దాఖలుకు తక్కువ వ్యవధి ఉండటంతో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు అవసరమైన పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర ఎన్నికల సంబంధిత ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది.

సీఈసీ ఎంపిక కు మద్దతిచ్చి తప్పు చేశాం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు.సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. "ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం" అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన పిలుపునిచ్చారు.

ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. "గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. "పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని జగన్ అభిప్రాయపడ్డారు.
ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా టీడీపీ ప్రభుత్వం ఎస్ఈసీని నియమించకూడదని ఆయన స్పష్టం చేశారు.

పోలీసులతో ఎన్నికలు చేయాల్సిన పరిస్థితి

- నామినేషన్లు వెళ్లే వారి పైన కేసులు: ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి



పులివెందుల మన జనప్రగతి అక్టోబర్ 18:-పోలీసులతో ఎన్నికల చేయాల్సిన పరిస్థితి వచ్చింది అని, డి.ఎస్.పి మద్యం మత్తులో కాల్పులు జరపడం జరిగిందని, నామినేషన్ల వేయడానికి వెళ్లే వారిపై కేసులు పెట్టారని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం నామినేషన్ సమయం ముగిసిన తర్వాత వైసీపీ ఆడిటోరియంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ శనివారం డీఐజీ కోయ ప్రవీణ్ కు ఫోన్ చేసి నామినేషన్ కు వెళ్లాలని కోరగా సీఐ ఫోన్ చేసి మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు రావాలని సమయములో ఇవ్వడం జరిగిందని ఆ సమయంలో అభ్యర్థులను నాలుగు వాహనాలలో తీసుకువెళ్లి నామినేషన్ వేయమని పోలీసులను కోరడం జరిగిందన్నారు. నామినేషన్ వేయడానికి కుదరదు అని పోలీసులు చెప్పడంతో నామినేషన్ వేయడానికి అభ్యర్థులు ప్రయత్నించడం జరిగినది అన్నారు. పోనివ్వకుండా అభ్యర్థులపై లాఠీచార్జి చేయడం జరిగింది అన్నారు. లాఠీచార్జి చేస్తున్న నామినేషన్ వేయడానికి వెళ్తున్న వారిపై పోలీసులు కాల్పులు చేశారన్నారు. నామినేషన్ సమయం తర్వాత జిల్లా ఎస్పీ పులివెందులకు వచ్చి రేపు నామినేషన్ని చేస్తామని హామీ ఇచ్చి రాత్రికి నా చేతకాదు అని చెప్పడం జరిగిందన్నారు. ఆదివారం వైయస్ మనోహర్ రెడ్డి ఇంటి నుంచి అభ్యర్థులు నామినేషన్ వేయడానికి వెళుతుంటే పోలీసులు అడ్డుకోవడం జరిగిందన్నారు. బీటెక్ రవికి ఎన్నికలు చేయడం చేతకాక జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డిని పిలిపించుకోవడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే గెలవలేమనే నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. వైసిపి నాయకులు చేసిన పోరాటానికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన నామినేషన్ ప్రక్రియ

- మూడవరోజు 1 చైర్మన్ 33 వార్డులకు నామినేషన్లు

- మొత్తం ఐదు చైర్మన్ 104 వార్డులకు నామినేషన్లు



పులివెందుల టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 18:- స్థానిక మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆదివారం 1 చైర్మన్, 33 వార్డులకు నామినేషన్ దాఖలయ్యాయి. మొత్తం 5 చైర్మన్ 104 వార్డులకు నామినేషన్లు ఇవ్వడం జరిగింది. చైర్మన్ కు టిడిపి 4 వైసిపి 1 దాఖలు చేశారు. వార్డులకు బిజెపి అలాగే 69 టిడిపి , 30 వైసీపీ , 4 బిజెపి , 1 జనసేన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడం జరిగిందని అసిస్టెంట్ ఎన్నికల అధికారి తనుజ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు కర్నూలు జిల్లాకు చేరుకున్న అబ్జర్వర్లు

- జిల్లా కలెక్టర్ తో సమావేశమైన అబ్జర్వర్లు



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 18:- రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణ నిమిత్తం కర్నూలు జిల్లాకు జనరల్ అబ్జర్వర్‌గా బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌గా కె. బాలరాజు, ఐ.ఎఫ్.ఎస్. అధికారులను నియమించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అబ్జర్వర్లు ఆదివారం ఉదయం కర్నూలు జిల్లాకు చేరుకున్నారు.అనంతరం కలెక్టరేట్ లో అబ్జర్వర్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తో సమావేశం అయి ఎన్నికల ఏర్పాట్ల గురించి చర్చించారు.

ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

- జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 18:- ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, బాధ్యతలపై సంబంధిత సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని కర్నూలు జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్ అన్నారు. ఆదివారం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్)లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను, అలాగే వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ స్థాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం, ఇందిరాగాంధీ నగర్‌లోని 59, 60, 61 వార్డుల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలను అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులు, బాధ్యతలను ఎన్నికల సంఘం హ్యాండ్‌బుక్ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు అందించిన శిక్షణలో వివరించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు.అంతకన్నా ముందు జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో కమిషనర్ చల్లా ఓబులేసు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించి, ఎన్నికల నిర్వహణ స్థితులపై చర్చించారు.కార్యక్రమంలో మేయర్ స్థాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వేణుగోపాల్, 59, 60, 61 వార్డుల రిటర్నింగ్ అధికారి ఐ.డి. శిరీష, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల మున్సిపల్ పోరులో హైడ్రామా

నామినేషన్ల రగడ,వైఎస్సార్సీపీ అభ్యర్థుల అడ్డగింత

పోలీసుల తీరుపై భగ్గుమన్న వైఎస్ ప్రమీల,వైఎస్సార్సీపీ కౌన్సిలర్ అభ్యర్థులు





పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 18:- పులివెందుల మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ చివరి రోజు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది.నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న వైఎస్సార్సీపీ కౌన్సిలర్ అభ్యర్థులను పోలీసులు, అధికార యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నాయని మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.చేతుల్లో కేవలం నామినేషన్ పత్రాలు మాత్రమే ఉన్న మహిళా అభ్యర్థులను సైతం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లనీయకుండా అడుగడుగునా నిర్బంధించారని ఆరోపించారు.నామినేషన్ల దాఖలుకు కేవలం గంట సమయం మాత్రమే మిగిలి ఉందని,ఉద్దేశపూర్వకంగానే సమయం ముగిసేలా చేసి తమను పోటీ నుంచి తప్పించేందుకు అధికార పార్టీ కుట్ర పన్నుతోందని అభ్యర్థులు మండిపడ్డారు.స్వయంగా జిల్లా ఎస్పీ హామీ ఇచ్చి సమయం కేటాయిస్తామని చెప్పినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉందని వైఎస్ ప్రమీల తెలిపారు.అభ్యర్థులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా హౌస్ అరెస్టులు చేయడంతో పాటు,మహిళల కార్లను సైతం అడ్డుకుని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. 144 సెక్షన్ పేరుతో ప్రతిపక్ష అభ్యర్థులను మున్సిపల్ కార్యాలయానికి కిలోమీటర్ల దూరంలోనే కట్టడి చేస్తున్న పోలీసులు, అధికార టీడీపీ శ్రేణుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని నేతలు ఆరోపించారు.తాము ఎటువంటి ఆయుధాలు లేకుండా,ప్రశాంతంగా ఒక్కొక్కరిగా వెళ్లి పత్రాలు అందజేస్తామని చెప్పినా పోలీసులు కనికరించడం లేదని కానీ మున్సిపల్ కార్యాలయం గేట్ల వద్ద టీడీపీ నాయకులు,కార్యకర్తలు రాడ్లు,కర్రలతో తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళా అభ్యర్థులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై లేదా?“ అని వైఎస్సార్సీపీ నేతలు నిలదీశారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల కమిషన్‌పై ఉందని అభ్యర్థులు స్పష్టం చేశారు.క్షేత్రస్థాయి పరిస్థితులు,అధికారుల తీరుపై ఆన్‌లైన్ ద్వారా ఎస్ఈసీకి డిజిటల్ ఆధారాలు పంపించినట్లు వైఎస్ ప్రమీల వెల్లడించారు. ఇక్కడ న్యాయం జరగకపోతే ఈ వ్యవహారాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.పులివెందులలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని,ఇక్కడి పరిస్థితులు తాలిబన్ రాజ్యాన్ని తలపిస్తున్నాయని నాయకులు తీవ్రంగా ధ్వజమెత్తారు.

పులివెందుల ఘటనపై పోలీసుల వివరణ

స్వీయరక్షణ కోసమే టియర్ గ్యాస్, గాలిలోకి కాల్పులు: పోలీసు శాఖ



పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 18:- పులివెందుల పట్టణంలో అక్టోబర్ 17న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని పోలీసు శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఘటనకు సంబంధించి కొన్ని టీవీ ఛానళ్లు, సోషల్ మీడియా వేదికల్లో తప్పుడు, నిర్ధారణ కాని సమాచారం ప్రచారమవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ పోలీసు శాఖ ప్రెస్‌నోట్ విడుదల చేసింది. **పోలీసులపై దాడి జరిగినట్లు వెల్లడి** ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడటంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పులివెందులలోని నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ నోటీసు జారీ చేసినప్పటికీ కొందరు వ్యక్తులు గుంపుగా అక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాఘవరెడ్డి అనే వ్యక్తి స్కార్పియో వాహనాన్ని వేగంగా నడుపుతూ, ఆపాలని సూచించినప్పటికీ ఆపకుండా విధుల్లో ఉన్న పోలీసుల వైపు దూసుకొచ్చినట్లు ప్రెస్‌నోట్‌లో వివరించారు. అనంతరం కొందరు వ్యక్తులు పోలీసులపై రాళ్లు విసరడంతో పాటు కర్రలు, ఇనుప రాడ్లతో దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు.ఈ ఘటనలో పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్. పురుషోత్తమ రాజు, తొండూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆర్. శివనాగిరెడ్డికి గాయాలైనట్లు వెల్లడించారు.**స్వీయరక్షణ కోసమే చర్యలు** పోలీసులపై రాళ్ల దాడి కొనసాగడం, విధుల్లో ఉన్న సిబ్బంది భద్రతకు ముప్పు ఏర్పడటంతో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించడంతో పాటు గాలిలోకి కాల్పులు జరిపినట్లు పోలీసు శాఖ తెలిపింది. గుంపులోని వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరపలేదని, స్వీయరక్షణతో పాటు గుంపును చెదరగొట్టి శాంతిభద్రతలను పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేసింది. గాయపడిన పోలీసు అధికారులను వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొంది. **63 మందితో పాటు ఇతరులపై కేసులు**ఈ ఘటనకు సంబంధించి మొత్తం 63 మందితో పాటు ఇతరులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. విచారణ అనంతరం తదుపరి చర్యలు చేపడతామని తెలిపింది.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోకుండా, ధ్రువీకరించని సమాచారం లేదా అసంపూర్ణ వీడియోల ఆధారంగా వార్తలు ప్రచారం చేయడం, సోషల్ మీడియాలో పంచుకోవడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. వార్తలను ప్రసారం చేసే ముందు వాటి నిజానిజాలను ధ్రువీకరించుకోవాలని మీడియా సంస్థలకు సూచించారు. ప్రజలు పుకార్లను నమ్మకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సారధి నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు







- 600 బతుకమ్మలతో మహిళల సందడి

- విజేతలకు బహుమతుల ప్రదానం

- పండుగ ఆనందోత్సవాల మధ్య 48వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతులు



ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి అక్టోబర్ 18:ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ సారధి నగర్‌లో బతుకమ్మ సంబరాలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ 48వ డివిజన్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సుమారు 600 బతుకమ్మలతో మహిళలు పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ.. ఆటపాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న భక్తురాళ్లకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతులు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం నగర అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగళ్ల దీపక్ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.కె. ఖాదర్ బాబా, కాంగ్రెస్ జిల్లా నాయకులు కమర్తపు మురళి హాజరై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర నాయకులు బాణాల లక్ష్మణ్, బోజట్ల సత్యనారాయణ, ప్రసన్న కుమార్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

డిసెంబర్ 3 వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం తాత్కాలిక నిలిపివేత

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లె,మన జనప్రగతి అక్టోబర్ 18:-స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున డిసెంబర్ 3వ తేదీ వరకు మదనపల్లె కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌తోపాటు క్షేత్రస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాలు కూడా డిసెంబర్ 3వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ నెల 19వ తేదీన నిర్వహించవలసిన 'పిజిఆర్ఎస్' కార్యక్రమం రద్దు

- జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి.



కడప టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 18 :- జిల్లాలో స్థానిక సంస్థల (మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచ్) ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) అమలులోకి వచ్చినందున, కలెక్టరేట్‌లో ఈనెల 19వ తేదీన, సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ మరియు డైలీ గ్రివెన్స్ కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఓ ప్రకటనలోతెలిపారు.ఈ ఎన్నికల కోడ్ అక్టోబర్ 14 నుండి డిసెంబర్ 03 వరకు అమలులో ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నా రు. ఈ గడువు ముగిసే వరకు ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారుప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్జీలు సమర్పణ కోసం కలెక్టరేట్ కు రావద్దని సూచించారు.

దుర్గాదేవి అలంకరణలో శ్రీ సత్యమ్మ తల్లి



వాల్మీకిపురం,మన జనప్రగతి అక్టోబర్ 18 :- వాల్మీకిపురం మండలం గండబోయినపల్లి కోటలోని శ్రీ సత్యమ్మ తల్లి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.బీదవారిపల్లికి చెందిన రమేష్ బాబు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ అధ్యక్షుడు పులి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి సద్దల చక్రపాణి, కోశాధికారి ప్రభాకర్ రెడ్డి, అర్చకులు ఉత్తన్న స్వామి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాసులు రెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

పీజేఆర్ స్టేడియంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రముఖ నాయకులు



శేరిలింగంపల్లి మన జనప్రగతి అక్టోబర్ 18:- చందానగర్ డివిజన్ పీజేఆర్ స్టేడియంలో పూజిత జగదీశ్వర్ గౌడ్ శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలంగాణ స్టేట్ ప్లానింగ్ కమిషన్ బోర్డు వైస్ చైర్మెన్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆడపడుచులు ఎంతో ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పాటలతో, ఆటపాటలతో వేడుకను ఘనంగా జరుపుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. మహిళలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ , నిర్వాహకురాలు పూజిత జగదీశ్వర్ గౌడ్ , శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక మహిళలు, నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అవినాష్ రెడ్డి హౌస్ అరెస్ట్

- ఇంటి చుట్టూ భారీ పోలీసు బందోబస్తు.. నామినేషన్ కేంద్రం వద్ద బారికేడ్లు





పులివెందుల, మన జనప్రగతి, అక్టోబర్ 18:- కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఇంటి వద్ద ఆదివారం భారీగా పోలీసు బలగాలను మోహరించి, ఆయన బయటకు వెళ్లకుండా ఆంక్షలు విధించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు ఆదివారం చివరి రోజు కావడంతో పులివెందులలో ఉదయం నుంచే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఓ అభ్యర్థితో కలిసి నామినేషన్ దాఖలు కేంద్రానికి వెళ్లనున్నారనే సమాచారంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటల నుంచే ఆయన నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నట్లు సమాచారం.అవినాష్ రెడ్డి వైసీపీ ఆడిటోరియం వద్దకు చేరుకున్న అనంతరం అక్కడ కూడా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆడిటోరియంలోకి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. వైసీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ నివాసం వద్ద కూడా పోలీసు బలగాలను మోహరించారు.నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న వైసీపీ మహిళా అభ్యర్థులను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. నామినేషన్ల దాఖలుకు ఆదివారమే చివరి రోజు కావడంతో తమను అనుమతించాలని అభ్యర్థులు పోలీసులను కోరినట్లు తెలిసింది. అయితే, ప్రస్తుతం శాంతిభద్రతల సమస్య ఉన్నందున వెళ్లేందుకు అనుమతించలేమని పోలీసులు చెప్పినట్లు సమాచారం.మరోవైపు, ఎంపీ అవినాష్ రెడ్డికి నామినేషన్ దాఖలు విషయంలో సహకరిస్తానని జిల్లా ఎస్పీ తొలుత చెప్పినప్పటికీ, పరిస్థితులు అనుకూలంగా లేవని అనంతరం తెలిపినట్లు స్థానికంగా సమాచారం ప్రచారంలో ఉంది. ఈ విషయంపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.ఇదిలా ఉండగా, నామినేషన్ల స్వీకరణ కేంద్రంగా ఉన్న పులివెందుల మున్సిపల్ కార్యాలయం చుట్టూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎవరూ లోపలికి ప్రవేశించకుండా, కేంద్రం పరిసరాల్లోకి రాకుండా ఆంక్షలు విధించారు. నామినేషన్ల గడువు ముగింపు నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు, అభ్యర్థుల ప్రయత్నాలతో పులివెందులలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది.

చారిత్రక కావ్యాలతో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపిన దుర్భాక

- యోగి వేమన విశ్వవిద్యాలయంలో 139వ జయంతి వేడుకలు



కడప, రూరల్ మన జనప్రగతి, అక్టోబర్ 18:- చారిత్రక కావ్య రచన ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన మహాకవి దుర్భాక రాజశేఖర శతావధాని అని సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి అన్నారు. ఆదివారం కేంద్రంలో దుర్భాక 139వ జయంతి నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యోద్యమ సమయంలో రాణా ప్రతాపసింహుడి చరిత్రను కావ్యంగా రచించి తెలుగువారిలో జాతీయ స్ఫూర్తిని నింపారని తెలిపారు. చండనృపాల చరిత్ర, వీరమతి, పుష్పావతి వంటి రచనలతో సాహిత్య రంగానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. గడియారం వేంకట శేషశాస్త్రితో కలిసి జంటగా అవధానాలు నిర్వహించి కీర్తి పొందారని వివరించారు.గ్రంథాలయ సహాయకులు ఎన్. రమేశ్‌రావు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలోనూ దుర్భాక పద్యకావ్య రచన కొనసాగించారని తెలిపారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు రాణా ప్రతాపసింహ చరిత్రలోని విశేషాలను వివరిస్తూ రెండు పద్యాలను వినిపించారు. మరో రచయిత ఎస్. సుబ్బరాయుడు దుర్భాక సాహిత్య సేవలను, ఆయన నిర్వహించిన సామాజిక, విద్యా సంస్థల పదవులను ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో కేంద్రం సిబ్బంది, పాఠకులు శ్రీనివాసులు, గంగయ్య, స్రవంతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఒక నీతి.. ఇప్పుడు మరో నీతా?

- వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు



అమరావతి, మన జనప్రగతి అక్టోబర్ 18 :- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శలు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా మాట్లాడటం తగదన్నారు. 2020 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ప్రతిపక్ష అభ్యర్థులు ఎదుర్కొన్న ఇబ్బందులపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నాడు మాచర్లలో టీడీపీ నాయకులు బోండా ఉమామహేశ్వరరావు, బుద్ధా వెంకన్నలపై దాడి, పుంగనూరు, నెల్లూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లకు ఆటంకాలు కలిగించారన్న ఆరోపణలను మంత్రి ప్రస్తావించారు. అప్పట్లో నమోదైన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. పరిషత్ ఎన్నికలను టీడీపీ బహిష్కరించాల్సి వచ్చిన పరిస్థితులను గుర్తుచేశారు.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పదవీకాలాన్ని తగ్గించిన అప్పటి ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసిన విషయాన్ని అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వానికీ ఉందన్నారు. 2020 స్థానిక ఎన్నికల సందర్భంగా 35 నామినేషన్ అడ్డంకులు, 23 బలవంతపు ఉపసంహరణలు, 55 హింసాత్మక ఘటనలకు సంబంధించిన ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ, వాటిపై తీసుకున్న చర్యలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి వాహన శ్రేణిపై దాడి, నామినేషన్ కేంద్రాల వద్ద ఘర్షణలపై వచ్చిన ఆరోపణలను నిష్పక్షపాతంగా విచారించాలని అచ్చెన్నాయుడు కోరారు. హింసకు పాల్పడినవారు ఏ పార్టీకి చెందినవారైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా నామినేషన్ వేసే అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.

హింసకు వైసీపీనే కారణం: ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

- పోలీసులపై రాళ్లు విసిరింది వైసీపీ నాయకులేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగుతుందని వెల్లడి



పులివెందుల, మన జనప్రగతి, అక్టోబర్ 18:- పులివెందులలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకు వైఎస్సార్‌సీపీ నాయకులే కారణమని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకాలు కల్పించారని, పోలీసులపై రాళ్లు విసిరింది వైసీపీ నాయకులేనని ఆయన పేర్కొన్నారు.ఆదివారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు, నిధుల వినియోగంపై విమర్శలు చేశారు. పీఏడీఏ నిధులతో చేపట్టిన పనుల్లో 20 శాతం మాత్రమే పూర్తి చేసి, 100 శాతం నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఎర్రబెల్లి చెరువుకు వైసీపీ నాయకులు నీరు తీసుకురాలేదని, కూటమి ప్రభుత్వం నీటిని అందించి చూపించిందని అన్నారు.అరటి రైతులకు సంబంధించి సూట్ విధానాన్ని అమలు చేయడం ద్వారా గత ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ, ఈ కేసులో తమపై ఆరోపణలు మోపి తప్పించుకోవాలని చూశారని ఆయన వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు దూరంగా ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు.గతంలో వైసీపీ అనుసరించిన విధానాలకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగుతుందని ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. పులివెందులలో హైవే రోడ్డు పనులు చేపట్టామని, రాయలసీమను ఉద్యానవన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.35 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పులివెందుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఎన్నికల నియమాలను ఉల్లంఘించారని కూడా ఎమ్మెల్యే ఆరోపించారు.ఈ సమావేశంలో బీజేపీ నాయకుడు శశిభూషణ్ రెడ్డి, టీడీపీ నాయకుడు మా రెడ్డి జోగిరెడ్డి మా రెడ్డి భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసింది వైసీపీనే.. ఫిర్యాదు చేసింది వారే: మంత్రి సవిత విమర్శలు

- స్థానిక ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని ధీమా



పెనుకొండ, మన జనప్రగతి, అక్టోబర్ 18:- స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా వైసీపీ నాయకులే దాడులకు పాల్పడి, ఇప్పుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత విమర్శించారు. ఆదివారం పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పలు ప్రాంతాల్లో వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు.ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డి నేతృత్వంలో పుంగనూరు, పులివెందుల, తిరుపతి, రాయచోటి ప్రాంతాల్లో దాడులు జరిగినట్లు మంత్రి ఆరోపించారు. అయితే, ఎన్నికల సంఘం, పోలీసుల చర్యలతో పులివెందుల, కడపలో గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయని పేర్కొన్నారు.గత స్థానిక ఎన్నికల్లో వైసీపీ నామినేషన్లను అడ్డుకోవడం, చింపివేయడం వంటి చర్యలకు పాల్పడిందని విమర్శించిన సవిత, కూటమి నాయకులు అలాంటి చర్యలకు పాల్పడలేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదంటూ వైఎస్ జగన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడాన్ని ఆమె తప్పుబట్టారు.కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం ఉందని మంత్రి పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయం సాధిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

స్థానిక ఎన్నికల పర్యవేక్షణకు అబ్జర్వర్ల నియామకం



మదనపల్లె, మన జనప్రగతి అక్టోబర్ 18 :- అన్నమయ్య జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు జనరల్ అబ్జర్వర్‌గా జి. బాలకృష్ణ, ఐఏఎస్, ఎన్నికల వ్యయ పరిశీలకురాలిగా ఎం. బబితా, ఐఎఫ్ఎస్ నియమితులైనట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.ఆదివారం మదనపల్లె కలెక్టరేట్‌కు చేరుకున్న పరిశీలకులకు కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటేష్ స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితులు, వ్యయ రికార్డుల పరిశీలనపై చర్చించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ం

మార్కాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ కిరణ్ కుమార్ నామినేషన్



మార్కాపురం, మన జనప్రగతి అక్టోబర్ 18:-:మార్కాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) తరపున ప్రముఖ దంత వైద్య నిపుణుడు డాక్టర్ కిరణ్ కుమార్ ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన దంత వైద్య విద్యతో పాటు న్యాయశాస్త్రంలోనూ పట్టా పొందినట్లు పార్టీ నాయకులు తెలిపారు.డాక్టర్ కిరణ్ కుమార్‌ను చైర్మన్ అభ్యర్థిగా పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఎంపిక చేసినట్లు మార్కాపురం నియోజకవర్గ బీసీవై పార్టీ కో-కన్వీనర్ కనపర్తి బాల గోవిందు యాదవ్ వెల్లడించారు. విద్యావంతులకు, సమాజంలోని అన్ని వర్గాల వారికి పార్టీలో ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో ఆయన ఎంపిక జరిగిందని పేర్కొన్నారు.డాక్టర్ కిరణ్ కుమార్ మార్కాపురం గ్రామ తొలి పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసిన ప్రముఖ వైద్యుడు స్వర్గీయ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు మనవడని బాల గోవిందు యాదవ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో పోటీ చేయడానికి ఆయన సిద్ధమయ్యారని పేర్కొన్నారు.

మదనపల్లె, రాయచోటి, పుంగనూరులో 588 నామినేషన్లు



మదనపల్లె, మన జనప్రగతి అక్టోబర్ 18 :- అన్నమయ్య జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మదనపల్లె, రాయచోటి, పుంగనూరు మున్సిపాలిటీల్లో మూడు రోజుల పాటు మొత్తం 588 నామినేషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 16 నుంచి 18 వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో మదనపల్లెలో అత్యధికంగా 410, పుంగనూరులో 108, రాయచోటిలో 70 నామినేషన్లు నమోదయ్యాయి. **మదనపల్లెలో 410 నామినేషన్లు**48 వార్డులున్న మదనపల్లె మున్సిపాలిటీలో మొదటి రోజు 14, రెండో రోజు 167, మూడో రోజు 229 నామినేషన్లు దాఖలయ్యాయి. చైర్మన్ పదవికి 20 నామినేషన్లు రాగా, టీడీపీ నుంచి 6, వైసీపీ నుంచి 9, బీఎస్పీ, కాంగ్రెస్ నుంచి ఒక్కొక్కటి, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 3 దాఖలయ్యాయి. కౌన్సిలర్ స్థానాలకు టీడీపీ 162, వైసీపీ 153, జనసేన 26, బీజేపీ 14, బీఎస్పీ 2, కాంగ్రెస్ 1, స్వతంత్ర అభ్యర్థులు 32 నామినేషన్లు సమర్పించారు. **రాయచోటిలో 70 నామినేషన్లు**44 వార్డులున్న రాయచోటి మున్సిపాలిటీలో మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. రెండో రోజు 40, మూడో రోజు 30 నామినేషన్లు వచ్చాయి. చైర్మన్ పదవికి టీడీపీ నుంచి ఒకరు, స్వతంత్రంగా ఒకరు నామినేషన్ వేశారు. కౌన్సిలర్ స్థానాలకు టీడీపీ 61, జనసేన 1, బీజేపీ 3, స్వతంత్ర అభ్యర్థులు 3 నామినేషన్లు దాఖలు చేశారు.**పుంగనూరులో 108 నామినేషన్లు**36 వార్డులున్న పుంగనూరు మున్సిపాలిటీలో మొదటి రోజు 20, రెండో రోజు 64, మూడో రోజు 24 నామినేషన్లు దాఖలయ్యాయి. చైర్మన్ పదవికి టీడీపీ నుంచి 8 నామినేషన్లు వచ్చాయి. కౌన్సిలర్ స్థానాలకు టీడీపీ 78, జనసేన 11, బీజేపీ 5, సీపీఐ 1, ఇతర పార్టీల నుంచి 1, స్వతంత్ర అభ్యర్థులు 4 నామినేషన్లు సమర్పించారు.మూడు మున్సిపాలిటీల్లో నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల తదుపరి దశలపై రాజకీయ పార్టీల దృష్టి కేంద్రీకృతమైంది.

తిరుపతిలో మూడో రోజు 201 నామినేషన్లు దాఖలు



తిరుపతి,మన జనప్రగతి అక్టోబర్ 18 :- తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మూడో రోజు ఆదివారం సజావుగా కొనసాగింది. మేయర్ స్థానానికి 24, కార్పొరేటర్ స్థానాలకు 177 కలిపి మొత్తం 201 నామినేషన్లు దాఖలైనట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ తెలిపారు.**మేయర్ స్థానానికి 24 నామినేషన్లు** మేయర్ స్థానానికి టీడీపీ నుంచి 5, వైఎస్సార్‌సీపీ నుంచి 2, సీపీఐ నుంచి 1, కాంగ్రెస్ నుంచి 1, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి 1, బీసీవైపీ నుంచి 2, బీఎస్పీ నుంచి 2 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు 8 నామినేషన్లు సమర్పించారు.**కార్పొరేటర్ స్థానాలకు 177 నామినేషన్లు** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లకు సంబంధించి కార్పొరేటర్ స్థానాలకు 177 నామినేషన్లు వచ్చాయి. వీటిలో టీడీపీ నుంచి 76, వైఎస్సార్‌సీపీ నుంచి 8, జనసేన నుంచి 45, బీజేపీ నుంచి 7, సీపీఎం నుంచి 2, సీపీఐ నుంచి 2, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 36, ఇతరుల నుంచి ఒక నామినేషన్ దాఖలైంది.నామినేషన్ల ప్రక్రియ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందని కమిషనర్ ఎం. జయకృష్ణ వెల్లడించారు.

క్రీడలు శారీరక,మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయి

- క్రికెట్‌లో విన్నర్, రన్నర్ లకు ట్రోఫీలు అందజేసిన ప్రజా చైతన్య సేవా సంఘం అధ్యక్షులు గడికోట చెన్నారెడ్డి



అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 18:- క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని ప్రజా చైతన్య సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గడికోట చెన్నారెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లి సమీపంలోని క్రీడా మైదానంలో నిర్వహించిన వన్డే ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ టోర్నమెంట్‌కు ట్రోఫీలను స్పాన్సర్ చేసిన చెన్నారెడ్డి.. విజేత శ్రీరాములు జట్టుకు, రన్నరప్ రమేష్ నాయక్ జట్టుకు ట్రోఫీలను అందజేశారు. రెండు మ్యాచ్‌ల్లోనూ అద్భుతమైన ప్రతిభ కనబరిచిన బాలాజీకి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ట్రోఫీని అందజేశారు.ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో క్రీడా పోటీలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో తనను కూడా భాగస్వామిని చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులోనూ క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం విజేత, రన్నరప్ జట్ల కెప్టెన్లు శ్రీరాములు, రమేష్ నాయక్‌లు గడికోట చెన్నారెడ్డిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించి విజయవంతం చేసిన క్రీడాకారులకు, అలాగే మ్యాచ్‌లు నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చిన అన్నమయ్య జిల్లా క్రీడల అధికారి చంద్రశేఖర్‌తో పాటు ఆయన సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు

గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల మహా ధర్నా వేదిక మార్పు



రామాపురం మన జనప్రగతి అక్టోబర్ 18:- భారతదేశ ఎల్పిజి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సంఘం అధ్యక్షుడు బి.ఎస్. శర్మ ఆదేశాల మేరకు, ఢిల్లీ పోలీసుల నిషేధం కారణంగా అక్టోబర్ 26న జంతర్ మంతర్ లో జరగాల్సిన ధర్నా, ఇప్పుడు అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు డిడిఏ కి చెందిన సిబిడి గ్రౌండ్, న్యూఢిల్లీలో జరుగుతుందనీ,ఇది అధికారిక నిరసన ప్రదేశం అని అన్ని జిల్లాల డిస్ట్రిబ్యూటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను జయప్రదం చేయవలసిందిగా ఏపీ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ప్రెసిడెంట్ సి.వి. సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రొద్దుటూరులో ఉద్రిక్తత.. వైసీపీ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం



ప్రొద్దుటూరు, మన జనప్రగతి అక్టోబర్ 18:- మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో ప్రొద్దుటూరులో ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ చైర్మన్ అభ్యర్థి పోరెడ్డి నరసింహారెడ్డి ఇంటి వద్ద పోలీసులకు, వైసీపీ నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.తమ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుంటున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు. అధికార పార్టీకి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, మాజీ కౌన్సిలర్ పాతకోట వంశీధర్ రెడ్డి తదితరులు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంటి వద్ద నిరసన తెలిపారు.మరోవైపు, ఇంటి రెండో అంతస్తులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డితో కలిసి పోరెడ్డి నరసింహారెడ్డి భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం.నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో స్థానికంగా ఉత్కంఠ నెలకొంది. వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలపై పోలీసుల వివరణ తెలియాల్సి ఉంది.

కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన కమిషనర్ ఎం. జయకృష్ణ



తిరుపతి మన జనప్రగతి అక్టోబర్ 18:-ఈ నెల 30వ తేదీన జరగనున్న తిరుపతి నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎస్.వి. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్ర ఏర్పాట్లను నగరపాలక కమిషనర్ జయకృష్ణ ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. 30వ తేదీన జరగనున్న కౌంటింగ్ కు సంబంధించి కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం గుర్తించిన గదులను, కౌంటింగ్ సామాగ్రిని, ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి వార్డుకు కేటాయించిన టేబుల్స్, వార్డు నెంబర్, పీఎస్ నెంబర్ లతో నేలపై వేసిన మార్కింగ్ లు, భద్రత కోసం ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లు, ఫెన్సింగ్ లను పరిశీలించారు. కౌంటింగ్ రోజున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, సర్వేయర్ గురువారెడ్డి, డీఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు చైర్‌పర్సన్ అభ్యర్థిగా మురల జ్యోతి నామినేషన్



నిడదవోలు, మన జనప్రగతి అక్టోబర్ 18 :- నిడదవోలు మున్సిపల్ ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థిగా మురల జ్యోతి ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, మూడు పార్టీల ఏకాభిప్రాయంతో నిడదవోలు మున్సిపాలిటీలోని 32 వార్డులకు కూటమి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్ స్థానాల్లోనూ విజయం సాధించడమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.గత రెండేళ్లలో నిడదవోలు నియోజకవర్గంలో సుమారు రూ.600 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. రహదారులు, డ్రైనేజీలు, పట్టణ సుందరీకరణ పనులతో పాటు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిడదవోలు బస్టాండ్‌ను ఆధునికీకరించేందుకు ప్రణాళికలు ఉన్నాయన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా అందాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని మంత్రి దుర్గేష్ ప్రజలను కోరారు.

జర్నలిస్టుల రక్షణకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి

● ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అల్లం రంగనాయకులు డిమాండ్



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 18:- రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న జర్నలిస్టుల రక్షణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్య అధికారి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అల్లం రంగనాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయన కడపలో ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార,ప్రతిపక్ష పార్టీల నాయకులు,కార్యకర్తలు రాజకీయ ఆధిపత్యం కోసం పరస్పరం దాడులకు దిగుతున్నారని,ఈ ఘర్షణలు మితిమీరి చివరికి విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయుల పైకి రావడం అత్యంత ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కడప జిల్లా బద్వేలులో 'మహా టీవీ' విలేకరి వెంకటేశ్వర్లుపై,పులివెందుల నియోజకవర్గంలో '6 టీవీ' విలేకరి చిన్న నరసింహులు, '10 టీవీ' విలేకరి రాజులపై జరిగిన దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై భౌతిక దాడులకు పాల్పడిన బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కొన్ని ప్రాంతాల్లో ప్రజారక్షణ కల్పించాల్సిన పోలీసులే విలేకరులపై దాడులకు పాల్పడటం అత్యంత దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్నికల విధుల్లో ఉన్న పాత్రికేయులకు పూర్తి రక్షణ కల్పించేలా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అన్ని జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



శేరిలింగంపల్లి మన జనప్రగతి అక్టోబర్ 18:- శిల్పారామం మాదాపూర్ లో సద్దుల బతుకమ్మ పండుగ రోజు పురస్కరించుకొని శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి సాయంత్రం బతుకమ్మ ఆటను సందర్శకులతోటి ఆడుకున్నారు. భువనేశ్వర్ నుండి విచ్చేసిన రోజ్లిన్ మోహాపాత్ర తన శిష్య బృందం చే ఒడిసి నృత్య ప్రదర్శనలో భో శంభో, జనసమ్మోహినీ పల్లవి, యుగే యుగే జగన్నాధ్ అంశాలను అనుష్క, సలోని, అర్పితా, పల్లవి, సాయి స్నేహ, సాయి శ్రాధలు ప్రదర్శించి మెప్పించారు . కూచిపూడి నృత్య ప్రదర్శన లో కుమారి యశస్వినీ శ్రీ బృందం "త్రిదేవి " కూచిపూడి నృత్య రూపకం ఆధ్యంతం అలరించింది. లక్ష్మి, పార్వతి సరస్వతి దేవి లు దుష్ట శిక్షణ కావించటానికి దుర్గ అమ్మవారిగా అవతరించడం కళ్ళకు కట్టినట్లు గ ప్రదర్శించారు. పాల్గొన్నవారు, లక్ష్మి ప్రియా, కార్తీక, దీప, అనూష, జోషిత హాసిని మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

టిడిపి నుంచి వైసీపీలోకి చేరిక



దేవనకొండ మన జన ప్రగతి అక్టోబర్ 18 :- దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన సుమారు 100 కుటుంబాలు టిడిపి పార్టీ నుండి వైసీపీ పార్టీలోకి ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సమక్షంలో ఆదివారం చేరినట్లు మండల వైసిపి నాయకుడు కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు విలేకరులకు తెలిపారు. ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆర్. హనుమంత రెడ్డి, మీనుగ కృష్ణ, అల్లం కొండ మాజీ ఎంపీటీసీ రంగడు, లక్ష్మణ స్వామి, ముచ్చు రామచంద్ర, కుమార్ మరి కొంతమంది సహకారంతో గ్రామంలోని టిడిపికి చెందిన లక్ష్మీనారాయణ, రాజేష్, మాజీ ఎంపిటిసి కౌలుట్లయ్యతో పాటు 100 కుటుంబాలు వైసీపీలోకి చేరినట్లు తెలిపారు. మండలంలో వైసిపి పార్టీ అభివృద్ధికి మరింత కృషిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిషాసుర మర్దిని అలంకారంలో శ్రీశ్రీశ్రీ దుర్గా మాతాజీ



రామాపురం మన జనప్రగతి అక్టోబర్ 18:- మండలంలోని నీలకంఠరావు పేట గ్రామం దర్బార్ సాయి నగరంలో వెలసిన శ్రీశ్రీశ్రీ దుర్గామాతజి నవరాత్రి ఉత్సవాలు భాగంగా ఆదివారం మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు ఈ ఉత్సవాల్లో వేద పండితులు అమ్మవారికి కలశ పూజా నైవేద్య కైంకర్యాలు నిర్వహించి విశేష అలంకారంతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. వచ్చిన భక్తాదులకు అమ్మవారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు సత్యమయ్య స్వామి శంకరయ్య స్వామిలు తెలియజేశారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి విశేషమైన అలంకరణలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృపా కటాక్షం పొందాలని తెలియజేశారు.

కడప కార్పొరేషన్‌లో మార్పునకు నాంది

- కూటమి మేయర్ అభ్యర్థి మట్లి సువర్ణ నామినేషన్ దాఖలు

కడప మన జనప్రగతి అక్టోబర్ 18:- నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థిగా మట్లి సువర్ణ కడప ఆర్డీఓ కార్యాలయంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే మాధవి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి పాల్గొని సువర్ణ తమ పూర్తి మద్దతు తెలిపి, అభినందనలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగర వికాసం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని ప్రతి గడపకూ చేర్చేందుకు, కడప సమగ్రాభివృద్ధి స్వచ్ఛమైన పాలన కోసం కార్పొరేషన్‌పై కూటమి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేసి, కూటమి మేయర్ అభ్యర్థి మట్లి సువర్ణ తో పాటు 66 డివిజన్లలోని కార్పొరేటర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

17 మంది కంటి రోగులకు ఆపరేషన్లు



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 18:- రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 17 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు.ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట,రైల్వే కోడూరు,సుండుపల్లె, వీరబల్లి,యర్రావారిపాలెం,కేవీవల్లి, కలకడ,కలికిరి, పీలేరు,గుర్రంకొండ ,పెద్దమండెం, ఎన్.పి.కుంట,చక్రాయపేట,కడప తదితర ప్రాంతాల నుండి వచ్చిన 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 17 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు.అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు,అద్దాలు పంపిణీ చేశారు.అనంతరం కంటి ఆపరేషన్ ల కోసం వచ్చిన కంటి రోగులతో పాటు వారి వెంట ఉన్న సహాయకులకు అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రంకొండ మండలం నడిమి కండ్రిగ పంచాయతీలోని మొటుకు గ్రామానికి చెందిన దాత ఎన్నారై ఎర్రగొండ గోవర్ధన్ రెడ్డి ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప్ గుప్తా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాషా,ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి,కంటి వైద్యులు సురేష్ బాబు,భార్గవి,ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాభవాని అమ్మవారి పూజలో పాల్గొన్న అనిల్ కుమార్ యాదవ్



శేరిలింగంపల్లి మన జనప్రగతి అక్టోబర్ 17:- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా స్థానికంగా కొలువుదీరిన దుర్గామాత మండపాలను సందర్శించి ,ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అర్చనలు కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.జగన్మాత అయిన దుర్గాదేవి కృపాకటాక్షాలతో శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలు వర్ధిల్లాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. అలాగే నియోజకవర్గం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ఉత్సవ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బొమ్మనహల్‌లో వేడెక్కిన స్థానిక ఎన్నికల రాజకీయం

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలపై పార్టీల దృష్టి



బొమ్మనహల్, మన జనప్రగతి, అక్టోబర్ 18:- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బొమ్మనహల్ మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహరచనలో నిమగ్నమయ్యాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో పాటు వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు, స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు.మండలంలో రాజకీయంగా పట్టు సాధించేందుకు పార్టీలు గ్రామాల వారీగా పరిస్థితులను అంచనా వేస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, పార్టీ బలాబలాల ఆధారంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. బలమైన అభ్యర్థులను బరిలోకి దింపి పరిషత్ స్థానాల్లో విజయం సాధించేందుకు కసరత్తు చేస్తున్నాయి.**సర్పంచ్ స్థానాలపైనా ప్రత్యేక దృష్టి**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలు కీలకంగా మారడంతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రధాన పార్టీల మద్దతుతో పోటీ చేయాలని భావిస్తున్న వారితో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ అనుచరులు, మద్దతుదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.గ్రామస్థాయిలో ప్రజల మద్దతు కూడగట్టడం, స్థానిక సమస్యలను ప్రచార అంశాలుగా తీసుకోవడం ద్వారా పట్టు సాధించాలని ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే కొద్ది బొమ్మనహల్ మండలంలో రాజకీయ కార్యకలాపాలు మరింత ఊపందుకునే అవకాశం ఉంది.

చప్పల్ బజార్‌లో అంగరంగ వైభవంగా అమ్మవారి దర్శనం



కాచిగూడ,మన జనప్రగతి అక్టోబర్ 18:- కాచిగూడ చప్పల్ బజార్‌లో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు దర్శించుకున్నారు. ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్, బర్కత్‌పురా డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కైరంకొండ శ్రీకాంత్ శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆశ్లేష్, కిషోర్ యాదవ్, మధుసూదన్, కళ్యాణ్, రోహన్, సాయి కృష్ణ, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బిజెపి సీనియర్ నాయకులు సతీష్ సందర్శించి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేవి నవరాత్రులలో అమ్మవారు స్కందమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముంబైకి చెందిన సుప్రసిద్ధ విగ్రహ శిల్పి 'కేపీ ఆర్ట్స్' కునాల్ పాటిల్ ఈ అమ్మవారి విగ్రహాన్ని అత్యంత అద్భుతంగా, శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఆఖరి ఘట్టం సజావుగా పూర్తి

• సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 18:- కర్నూలు నగరంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ చివరి రోజైన ఆదివారం ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ క్షేత్రస్థాయిలో పర్యటించి నామినేషన్, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.ముందుగా ఆరోరా నగర్‌లో ఏర్పాటు చేసిన రెండు నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వీకర్ సెక్షన్ కాలనీ (రెండు ట్యాంకుల వద్ద)లోని స్వర్ణ లక్ష్మీపురం పేట సచివాలయం నామినేషన్ కేంద్రాన్ని, మరియు హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి భద్రతా చర్యలను సమీక్షించారు.చివరగా వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ల దాఖలు ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీల్లో ఎస్పీతో పాటు కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, కర్నూలు ఫోర్ట్ టౌన్ సీఐ విక్రమసింహ, త్రీ టౌన్ సీఐ శేషయ్య, సంబంధిత ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కడప మేయర్ అభ్యర్థిగా బండి మార్తమ్మ నామినేషన్ దాఖలు



కడప టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 18:- కడప నగర మేయర్ పదవికి కాంగ్రెస్ పార్టీ తరఫున సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య సతీమణి బండి మార్తమ్మ ఆదివారం కడప ఆర్డీఓ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు.బండి మార్తమ్మ, బండి జకరయ్య దంపతులు సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. బండి మర్తమ్మ 2000 సంవత్సరంలో కడప మండల ఉపాధ్యక్షురాలిగా పనిచేసి ప్రజలకు సేవలందించారు.బండి జకరయ్య 1982 సంవత్సరం నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వివిధ హోదాల్లో విశేష సేవలందించారు. ఆయన కడప నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా సేవాదళ్ చైర్మన్‌గా, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా, ఏపీసీసీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అలాగే కర్నూలు, నంద్యాల ప్రాంతాలతో పాటు తమిళనాడులోని రామనాథపురం జిల్లాకు పార్టీ ఇన్‌చార్జిగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారు.వారి కుటుంబానికి చెందిన బండి సుమంత్ కుమార్ సైతం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.దీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవలో కొనసాగుతున్న బండి మర్తమ్మ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం పార్టీ శ్రేణుల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

జగద్గిరిగుట్టలో కన్నులపండువగా సద్దుల బతుకమ్మ



కూకట్ పల్లి మన జనప్రగతి అక్టోబర్ 18:- తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు జగద్గిరిగుట్ట పరిధిలోని అంజయ్యనగర్‌లో అత్యంత వైభవంగా, కన్నులపండువగా సాగాయి. ఆడపడుచులంతా ఒకేచోటికి చేరి బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకొన్నారు.తీరొక్క పూలతో సుందరంగా అమర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళలంతా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులు, తీరొక్క పూల పరిమళాల నడుమ అంజయ్యనగర్ పరిసరాలన్నీ పండుగ శోభతో విలసిల్లాయి. మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సమీపంలోని జలశయాల్లో బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తీరొక్క పూల జాతరను తలపించిన ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతోషాన్ని పంచుకున్నారు.

బసంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద పూల బతుకమ్మ సందడి



కూకట్‌పల్లి మన జన ప్రగతిఅక్టోబర్ 18:- బసంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువు వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో పూలతో భారీ బతుకమ్మను ఏర్పాటు చేసి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.వేడుకలకు విచ్చేసిన భక్తులు, ప్రజలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ మరియు బాదం మిల్క్‌అందజేశారు. పండుగకు హాజరైన వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా అజయ్ రాయుడు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని బసంతి ఫౌండేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ప్రజల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడమే ఇటువంటి వేడుకల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.



కనకదుర్గమ్మ ఆలయం వద్ద చండీయాగం

కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 18 :- గాంధీనగర్ రైతు బజార్ ప్రాంగణంలో గల శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద దుర్గాష్టమి సందర్భంగా కూనపురెడ్డి శంకర్ నారాయణ దంపతులు వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మహా చండీ యాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ చండీయాగంలో ముందుగా గణపతి పూజ తో ప్రారంభించి చండీయాగం అనంతరం హోమం నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని యావత్ ప్రపంచం సుభిక్షంగా ఉండాలని ఉద్దేశంతో ఈ చండీ హోమం నిర్వహించినట్టు శంకర్ నారాయణ, మాజీ కార్పొరేటర్ దండుమహంతి లక్ష్మణరావు, అన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషు, కుమార్, నాగేశ్వరరావు, గుండు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

- పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయ సమ్మేళనం




కొండాపురం, మన జనప్రగతి, అక్టోబర్ 18: కొండాపురం జడ్పీ హైస్కూల్‌లో 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం 30 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు .తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ముందుకు సాగేందుకు మార్గనిర్దేశం చేసిన అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మూడు దశాబ్దాల తర్వాత స్నేహితులంతా కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు రామచంద్ర రాజు, చెంచిరెడ్డి, రాజారెడ్డి, ఖాజా మొహిద్దీన్, జయరాజు పాల్గొని పూర్వ విద్యార్థులను ఆశీర్వదించారు.

ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని కలిసిన వేంపల్లి టిడిపి నేతలు



వేంపల్లె మన జన ప్రగతి అక్టోబర్ 18: జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని ఆదివారం పలువురు వేంపల్లి మండల తెదేపా నేతలు కలిశారు. పులివెందులకు వచ్చిన ఆయనను తెదేపా కార్యాలయంలో వేంపల్లె కు చెందిన తెదేపా నేతలు దిల్ మాంగే చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో మొండోడు గౌస్, షేక్ చిన్న తాజ్, తక్కెళ్ళ షరీఫ్ ఇంకా పలువురు నేతలు ఆదినారాయణరెడ్డిని కలిసిపలువిషయాలగురించి ఆయనతో చర్చించారు.

మహిషాసుర మర్దిని దేవిగా వాసవి మాత దర్శనం




వేంపల్లె మన జన ప్రగతి అక్టోబర్ 18:- దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక అమ్మవారి శాలలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరమ్మ ఆదివారం మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ, నెల్లూరు అర్చకుడు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో తీర్చిదిద్దారు.

శిల్పారామంలో ఘనంగా దసరా సాంస్కృతిక సంబరాలు



పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 18:- పులివెందుల శిల్పారామంలో దసరా సంబరాల్లో భాగంగా దుర్గాష్టమి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా అలరించాయి. శ్రీ రాజా కళానిలయం ఆధ్వర్యంలో బి. రాజా, బి. రాజేష్ పర్యవేక్షణలో చిన్నారులు వివిధ పాటలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అమ్మవారి పాటతో ప్రారంభమైన ప్రదర్శనలు అయిగిరి నందిని, ఇరుముడి కట్టు తదితర పాటలతో కొనసాగాయి.ప్రశ్విత, హర్షిత, తమన్న, అఖిల్, రేవంత్ తదితర చిన్నారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఉమా ట్రేడర్స్, భావన డయా బెస్ట్ రైస్ సంస్థలు కార్యక్రమానికి స్పాన్సర్‌గా సహకరించాయి.శిల్పారామం పరిపాలనాధికారి బి. సుధాకర్, ఇస్మాయిల్ సాహెబ్, బి. సుబ్బారావు, కిషోర్, సిబ్బంది పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. దసరా సందర్భంగా వరుసగా మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విజయలక్ష్మి దేవిగా పార్వతి మాత



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 18:- దసరా ఉత్సవాల్లో భాగంగా వేంపల్లి మండలం నంది పల్లె శ్రీ నందీశ్వరాలయంలో వెలసిన పార్వతీ మాత విజయలక్ష్మి దేవి అలంకా రంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుని ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. కాగా ఈనెల 19న సోమవారం ఉదయం 9 గంటలకు ఈ ఆలయంలో చండీయాగం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావాలని ఆలయ వ్యవస్థాపకుడు మారం శ్రీకాంత్ రెడ్డి కోరారు.

ఎంపీ అవినాష్ రెడ్డితో సహా 560 మందిపై కేసు నమోదు



పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 18:-

కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డితో సహా మొత్తం 560 మందిపై రెండు కేసులు నమోదు చేసినట్లు పులివెందుల సీఐ పురుషోత్తం రాజు తెలిపారు.శనివారం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా వైఎస్సా ర్‌సీపీ నాయకులు ర్యాలీగా వచ్చినట్లు పోలీసులు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉండగా ర్యాలీ నిర్వహించారనే ఆరోప ణపై ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, దుశాంత్ రెడ్డి తదితరులపై ఒక కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పోలీసులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణపై ఎంపీ అవినాష్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) రాఘవరెడ్డితో పాటు మరో 500 మందికి పైగా వ్యక్తులపై రెండో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ పురుషోత్తం రాజు తెలిపారు.

జైస్వాల్ గార్డెన్స్‌లో వైభవంగా శ్రీ మైసమ్మ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



హైదరాబాద్, మన జనప్రగతి అక్టోబర్ 18:- జైస్వాల్ గార్డెన్స్‌లోని శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన ఆదివారం అమ్మవారు శ్రీ దుర్గాదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈరోజుతో ఆలయంలో కుంకుమార్చన పూజలు ముగియడంతో, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు.పాల్గొన్న ప్రముఖులు:ఆలయ కమిటీ అధ్యక్షులు చెరుకు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. ఇంద్రసేన్ యాదవ్, చైర్మన్ ఎన్. రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కె. దిలీప్ గౌడ్, కోశాధికారి పి. వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.అలాగే చీఫ్ సలహాదారులు జి. ప్రసన్నాంజనేయులు, జి. సురేందర్, ఎ. రామగౌడ్, బి. మధుసూదన్ చారి, పి. శ్రీహరి చారి మరియు కమిటీ సభ్యులు పి. రామస్వామి, కె. ఈశ్వరయ్య, కె. అశోక్ కుమార్, టి. కృష్ణవేణి తదితరులు పర్యవేక్షించారు.ఈ పూజా కార్యక్రమాలలో కాలనీవాసులు లక్ష్మయ్య గౌడ్, ఎ. సత్యనారాయణ, ఎన్. స్వామి గౌడ్, అంజయ్య గౌడ్, గోవర్ధన్ రెడ్డి, కె. సత్యనారాయణ, రాజమల్లు, విజయ్ బాబు, శ్రీనివాస్ గుప్తా, కె. శ్రీధర్, రాకేష్, నరేష్, రాంచందర్ రావు, సంతోష్ గుప్తా తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఉమ్మడి కడప జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు కూటమి ఖాతాలోకి

- చైర్మన్ పదవులకు వైసీపీ నుంచి నామినేషన్లు లేకపోవడంతో ఆసక్తికరంగా మారిన ఎన్నికల పరిణామం



కడప టౌన్ మన జనప్రగతి: ఉమ్మడి కడప జిల్లాలో మున్సిపల్ ఎన్నికల రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. జిల్లాలోని కమలాపురం, ఎర్రగుంట్ల, రాయచోటి, మైదుకూరు మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఆ నాలుగు స్థానాల్లో కూటమి అభ్యర్థులకు అవకాశం మెరుగైనట్లు కనిపిస్తోంది.ఉమ్మడి కడప జిల్లాలో మొత్తం తొమ్మిది మున్సిపాలిటీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నాయి. నాలుగు మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులకు వైసీపీ నుంచి నామినేషన్లు లేకపోవడం ఎన్నికల రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అయితే, ఈ స్థానాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

చప్పల్ బజార్‌లో అంగరంగ వైభవంగా అమ్మవారి దర్శనం

కాచిగూడ, మన జనప్రగతి అక్టోబర్ 18:కాచిగూడ చప్పల్ బజార్‌లో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు దర్శించుకున్నారు. ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్, బర్కత్‌పురా డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కైరంకొండ శ్రీకాంత్ శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆశ్లేష్, కిషోర్ యాదవ్, మధుసూదన్, కళ్యాణ్, రోహన్, సాయి కృష్ణ, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బిజెపి సీనియర్ నాయకులు సతీష్ సందర్శించి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేవి నవరాత్రులలో అమ్మవారు స్కందమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముంబైకి చెందిన సుప్రసిద్ధ విగ్రహ శిల్పి 'కేపీ ఆర్ట్స్' కునాల్ పాటిల్ ఈ అమ్మవారి విగ్రహాన్ని అత్యంత అద్భుతంగా, శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు



కల్లూరు, మన జనప్రగతి అక్టోబర్ 18:కల్లూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్ 16వ వార్డులో కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు ఆధ్వర్యంలో రూ. 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా కౌన్సిలర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.దశాబ్దాలుగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు నిలిచిపోవడం, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడం, దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలడం వంటి సమస్యలతో అంబేద్కర్ నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో చిన్నారులు, మహిళలు, విద్యార్థులు అనారోగ్య సమస్యలతో సతమతమయ్యేవారు.ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మున్సిపల్ చైర్మన్ సూచనలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత 16వ వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులకు, కౌన్సిలర్ ఉబ్బన రాంబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బతుకమ్మ వేడుకల్లో మేయర్ దంపతుల సందడి

● కరీంనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



కరీంనగర్, మన జనప్రగతి అక్టోబర్ 18: కరీంనగర్ నగరంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తీగలగుట్టపల్లిలోని అయ్యప్ప దేవాలయం వద్ద నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఆయన సతీమణి స్వర్ణలత కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలతో కలిసి సంప్రదాయ పాటలకు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు.ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ నగర ప్రజలకు సద్దుల బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని గౌరమ్మను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

బతుకమ్మను ఎత్తుకుని ఆడిపాడిన మంత్రి పొన్నం ప్రభాకర్

బతుకమ్మ వేడుకల్లో సందడి చేసిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే గంగుల, కోమటిరెడ్డి

ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు



కరీంనగర్, మన జనప్రగతి అక్టోబర్ 18: మార్క్‌ఫెడ్ గ్రౌండ్ లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ వేడుకల్లో కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొని బతుకమ్మను ఎత్తుకుని ఆడబిడ్డలతో కలిసి ఆడి పాడారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహిస్తోందని, ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్, కార్పొరేటర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి

అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు..: రామడుగు సర్పంచ్ మొయిజ్..



రామడుగు, మన జనప్రగతి అక్టోబర్ 18:తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు ఆటపాటలు కోలాటాలతో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రామడుగు గ్రామ సర్పంచ్ మహమ్మద్ మొయిజ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే పండుగ అని ఇలాంటి వేడుకలు సాంప్రదాయ విలువలను కాపాడటమే కాకుండా కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయన్నారు, ఎక్కడైనా దేవుళ్లకు పూలు పెట్టి కొలుస్తాము కానీ పువ్వులనే దేవతగా కొలిచే సాంప్రదాయం ఒక తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతకమ్మని తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని తెలిపారు. బతుకమ్మ సంబరాల్లో మహిళా అందరూ రంగురంగుల చీరలతో బతుకమ్మలను అలంకరించి పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో వేడుకను జరిపారు, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజలుపాల్గొన్నారు.



కరువుపై అధ్యయనమే ప్రజాయాత్ర లక్ష్యం

- రైతులకు భరోసా కల్పిస్తాం: హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ



పెద్దపల్లి మన జనప్రగతి అక్టోబర్ 18:రైతులకు భరోసా కల్పిస్తూ కరువు పరిస్థితులపై అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను ప్రభుత్వానికి నివేదించడమే ప్రజాయాత్ర లక్ష్యమని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ తెలిపారు. పెద్దపల్లి కమాన్ ప్రెస్ క్లబ్ లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ వరకు రాష్ట్రవ్యాప్తంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోయారని, రానున్న రోజుల్లో కరువు తీవ్రత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. నీటి లభ్యతను బట్టి వరికి బదులు కంది, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కళాకారుల బృందాలతో ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామన్నారు. అసైన్డ్ భూములపై పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా, మూడేళ్లుగా నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కునారం గ్రామంలో అసైన్డ్ భూముల సమస్య కొనసాగుతోందని, సుద్దాల గ్రామంలో విద్యుత్తు లేక రైతులు డీజిల్ ఇంజిన్లతో సాగు చేస్తున్నారని తెలిపారు. ఎదులాపురంలో వరి పంటలు ఎండిపోవడాన్ని గుర్తించామన్నారు. ఎస్ఐఆర్‌తో ఓటు హక్కు కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దేశవ్యాప్త కులగణనలో బీసీ పదం చేర్చడం, విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ సిబ్బంది, కళాకారులు గుగ్గిళ్ల ఎల్లన్న, కడారి శ్రీనివాస్, మేడ స్వామి, యాకుబ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై జవహర్‌నగర్‌లో నిరసన

- 13 కోట్ల పేర్ల తొలగింపుపై ఆందోళన





జవహర్‌నగర్,మన జనప్రగతి అక్టోబర్ 18:ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేస్తూ మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్‌లో శాంతియుత నిరసన నిర్వహించారు. 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించారనే నివేదికల నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.మేడ్చల్ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ మాజీ ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనకు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి సదానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కరింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు మురుగోని వెంకటేష్ గౌడ్, కుతాడి సాయి, బింగి సతీష్ గౌడ్, జమాల్‌పూర్ నవీన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండాలని, జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని నిరసనకారులు కోరారు. ఓటు హక్కు పరిరక్షణకు, ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపుపై సమగ్ర పరిశీలనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మల్లంపల్లిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు!

- సంప్రదాయ అలంకరణలు.. కోలాటాల కోలాహలం.. డీజే పాటలకు ఉత్సాహంగా నృత్యాలు





మల్లంపల్లి, మన జనప్రగతి అక్టోబర్ 18:తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ దుస్తుల్లో మహిళల సందడి, కోలాటాలు, డీజే పాటలకు నృత్యాలతో అంగడి ప్రాంతం పండుగ శోభను సంతరించుకుంది. మహిళలు సంప్రదాయ దుస్తులు, ఆభరణాలతో ముస్తాబై బతుకమ్మలను అందంగా అలంకరించి వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ కోలాటాలు ఆడారు. చప్పట్లు కొడుతూ సంప్రదాయ పాటలతో పాటు డీజే పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ వేడుకల్లో పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు.మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు ఆధ్వర్యంలో వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అంగడి ప్రాంతాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో రాత్రివేళ బతుకమ్మ సంబరాలు మరింత ఆకర్షణీయంగా కనిపించాయి. బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని ఈ వేడుకలు చాటిచెప్పాయి. సంప్రదాయ ఆటపాటలు, పూల అందాలు, విద్యుత్ కాంతుల మధ్య మల్లంపల్లిలో సద్దుల బతుకమ్మ సంబరాలు కన్నుల పండువగా సాగాయి.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- ఆటపాటలతో మారుమోగుతున్న పల్లెలు.. పూల పండుగలో ఆడపడుచుల సందడి



ఏటూరునాగారం, మన జనప్రగతి అక్టోబర్ 18: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని 13వ వార్డులో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొంటున్నారు. బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగ సందడిని తీసుకొస్తున్నారు.తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు మహిళలు ఉత్సాహంగా పాల్గొంటూ సంప్రదాయ జానపద గీతాలు ఆలపిస్తున్నారు. దీంతో వార్డులో పండుగ వాతావరణం నెలకొంది.బతుకమ్మ పండుగ కేవలం పూల వేడుక మాత్రమే కాకుండా తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతిని ఆరాధిస్తూ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకోవడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆటపాటలతో పల్లెలు మారుమోగుతుండగా, బతుకమ్మ సంబరాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతున్నాయి.

సమ్మె శిబిరంలో సద్దుల బతుకమ్మ

ఎన్‌హెచ్‌ఎం మహిళా ఉద్యోగుల వినూత్న నిరసన

అన్ని క్యాడర్ల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి: ఎం. సుమలత



ఏటూరునాగారం,మన జనప్రగతి అక్టోబర్ 18: సద్దుల బతుకమ్మ పండుగను సైతం సమ్మె శిబిరంలోనే నిర్వహిస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) మహిళా ఉద్యోగులు వినూత్నంగా నిరసన తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రి వద్ద పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ వేడుకలు నిర్వహించారు. అదే సమయంలో తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఉద్యోగులు ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు సమ్మె చేపట్టారని మండల జేఏసీ కార్యదర్శి ఎం. సుమలత తెలిపారు. ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నప్పటికీ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని, ఉద్యోగ భద్రత లేక భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నామని పేర్కొన్నారు.ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని సుమలత డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయడంతో పాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలని కోరారు.పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాల్సిన సమయంలో సమ్మె శిబిరంలో గడపడం బాధాకరమని మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ సమస్యలపై స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. డిమాండ్లు నెరవేరే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- ఆటపాటలతో మారుమోగుతున్న పల్లెలు

ఏటూరునాగారం,మన జనప్రగతి అక్టోబర్ 18: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పల్లెల్లో సందడి నింపుతోంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు ఉత్సాహంగా వేడుకలు జరుపుకుంటున్నారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఆనందాన్ని పంచుకుంటున్నారు.బతుకమ్మ పండుగ ఆడపడుచుల ఆత్మీయతకు, ఆత్మగౌరవానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతిని ఆరాధిస్తూ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కొనసాగించడం ద్వారా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతున్నారు.

శ్రీనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- సర్పంచ్ ఆకుల మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు



శ్రీనగర్ మన జనప్రగతి అక్టోబర్ 18:తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు శ్రీనగర్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి.సర్పంచ్ ఆకుల మల్లేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకోగా,మహిళల ఆటపాటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది.వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను మహిళలు ఒకచోట చేర్చి,వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు.డీజే పాటల హోరు,మహిళల కోలాహలంతో పండుగ ప్రాంగణం మార్మోగింది.సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పాల్గొని బతుకమ్మ సంబరాలకు మరింత శోభను తీసుకొచ్చారు.పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది.తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కొనసాగిస్తూ శ్రీనగర్‌లో సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకోవడం విశేషంగా నిలిచింది.సర్పంచ్ ఆకుల మల్లేష్ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- ఆటపాటలతో మారుమోగుతున్న పల్లెలు

ఏటూరునాగారం,మన జనప్రగతి అక్టోబర్ 18: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పల్లెల్లో సందడి నింపుతోంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు ఉత్సాహంగా వేడుకలు జరుపుకుంటున్నారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఆనందాన్ని పంచుకుంటున్నారు.బతుకమ్మ పండుగ ఆడపడుచుల ఆత్మీయతకు, ఆత్మగౌరవానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతిని ఆరాధిస్తూ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కొనసాగించడం ద్వారా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతున్నారు.





PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174